
**కామెడీ కథ**

# వీరాంజనేయులు రామాంజనేయులతో



**వీరాంజనేయులు వానరుడు. రామాంజనేయులు మానవుడు. వీరాంజనేయులు కాపురం చెట్టుమీద. రామాంజనేయులు కాపురం ఇంట్లో. వీరాంజనేయులు వయసు ఆరేళ్లయితే, రామాంజనేయులు వయసు అరవై ఏళ్లు. వీరాంజనేయులు యువకుడు, బలాఢ్యుడయితే, రామాంజనేయులు వృద్ధుడు, బక్కప్రాణి. ఇప్పుడు ఇద్దరికీ వైరం. నిప్పుమీద వేసిన ఉప్పులా ఇద్దరూ ఒకరి పేరు వింటే మరొకరు చిటపటలాడిపోతున్నారు.**

వీరిద్దరికీ తగాదా వచ్చినప్పటి నుంచీ రామాంజనేయులు భార్య మహాలక్ష్మమ్మకు ఏమీ పాలుపోవడం లేదు. అటు వీరాంజనేయులు పచ్చి జామకాయ ముట్టడం లేదు. ఇటు రామాంజనేయులు గ్లాసు మంచినీళ్లు తాగడం లేదు. అటు రామభక్త హనుమాన్. ఇటు సాక్షాత్తూ రాముడు. అటు బిడ్డ లాంటి హనుమ. ఇటు దైవం లాంటి భర్త.

ఇద్దరి మధ్యా సయోధ్య కుదర్చడానికి ఆమె చెయ్యాల్సిందంతా చేసింది. కానీ కుదరలేదు. ఇటు దొడ్లో కొమ్మమీద కూర్చున్న హనుమాన్లు తన కోరపళ్లన్నీ బయటపెట్టి ఉగ్రంగా కిచకిచమంటున్నాడు. అటు కోదండరాముడంతటి రామాంజనేయులు మంచం మీద కూర్చుని గుడ్లు పెద్దవి చేసి అరుస్తున్నాడు. ఇలా ఒకర్నిచూసి ఒకరు కయ్యానికి కాలు దువ్వుతూంటే, మహాలక్ష్మమ్మ పరిస్థితి పొడుచుకుంటున్న రెండు పొట్టేళ్ల మధ్యపడి నలిగిన గొర్రెపిల్ల చందాన ఉంది.

అసలింతటి గొడవకు కారణమయిన నిన్నటి సంఘటన పదేపదే గుర్తుకు వస్తోంది మహాలక్ష్మమ్మకు. నిన్న సాయంత్రం రామాంజనేయులుకు, మహాలక్ష్మమ్మకు చిన్నపాటి ఘర్షణ జరిగింది. రామాంజనేయులు మహాలక్ష్మమ్మ పుట్టింటి వాళ్లను తమాషాకు ఏదో అన్నాడు. అది సహించలేని మహాలక్ష్మమ్మ భర్త రామాంజనేయులు తరపు వారిని కూడా ఏదో అంది. రామాంజనేయులుకు కోపమొచ్చి మళ్లీ ఏదో మాటన్నాడు. మహాలక్ష్మమ్మ తిరిగి ఏదో అంది. ఇలా చిన్న విషయం పెద్దదయింది. దాంతో ఉగ్రుడయిన రామాంజనేయులు పురుషాహంకారంతో భార్య చెంపమీద లాగి కొట్టి ఆ కోపంతో దొడ్లోకి వచ్చాడు.

దొడ్లో జామచెట్టు కొమ్మమీద కూర్చుని కిటికీ లోంచి అంతా చూస్తున్న హనుమాన్లు వెంటనే జామచెట్టు మీంచి కొబ్బరి చెట్టు మీదికి దూకి చకాచకా పైకెక్కాడు. మరుక్షణంలో రామాంజనేయులు నెత్తిమీద కొబ్బరి బోండాం ఠప్‌మని పడింది.

''చచ్చాన్రో బాబో'' అంటూ అరచి నేలమీద కూర్చున్నాడు రామాంజనేయులు.

లోపల చెంప పట్టుకుని ఏడుస్తున్న మహాలక్ష్మమ్మ, రామాంజనేయులు కేక విని భర్తకి ఏమయిందో అనుకుంటూ కోపం మరచి దొడ్లోకి పరుగెత్తుకు వచ్చింది. అక్కడి దృశ్యం చూసి మ్రాన్పడిపోయింది. బిడ్డలాంటి హనుమాన్లుని తండ్రిలాంటి రామాంజనేయులు వెదురుగడతో పదేపదే పొడుస్తున్నాడు. ఆ పొడుపులు తప్పించుకుంటూ ఆ కొమ్మమీది నుంచి ఈ కొమ్మమీదికి ఎగురుతున్నాడు హనుమాన్లు. అప్పుడప్పుడూ నడుంపైకెత్తి తల కిందికి వంచి పళ్లన్నీ బయటపెట్టి ఉగ్రంగా కిచకిచమని అరుస్తున్నాడు. ఆ కోపానికి వాడి పొడవైన తోక నీలుక్కుని పైకి లేచింది. చెవులు నిక్కబొడుచుకున్నాయి. బొచ్చు విచ్చుకుంది. కళ్లు ఎర్రగా మారాయి.

''ఏమిటండీ ఇది. హనుమాన్లుని ఎందుకలా పొడుస్తున్నారు?'' అంది మహాలక్ష్మమ్మ.

''వాడిని పొడవాల్నా. చంపాల్నా. నిన్ను నేను చెంపమీద కొట్టానని వాడు కొబ్బరి కాయతో నా తల బద్దలు కొట్టాడే'' ఏడుపు ముఖంతో అన్నాడు రామాంజనేయులు తన మాడు చూపిస్తూ.

కొబ్బరి బోండాం పడ్డ చోట మరో చిన్న కొబ్బరి బోండాం లాంటి బుడిపె కట్టి ఉంది రామాంజనేయులు బట్టతల మీద.

లోపలికి వెళ్లి ఆయింటుమెంటు తెచ్చి పూస్తూ- ''హనుమాన్లు పసివాడు. ఏదో తెలీసో తెలియకో చేశాడు. వాడ్ని క్షమించండి'' ప్రాధేయపడింది మహాలక్ష్మమ్మ.

''వాడు పసివాడు కాదే పగవాడు. వాడ్ని క్షమించడమా నెవర్. వాడూ నువ్వూ ఒకటే. ఈ ఇంట్లో వాడో నేనో ఒకరే ఉండాలి. ఎవరు ఉండాలో తేల్చుకో'' అన్నాడు రామాంజనేయులు ఖరాఖండీగా.

అనడమే కాదు, వెదురుగడ అక్కడ పడేసి కోపంగా లోపలికి వెళ్లిపోయాడు. మహాలక్ష్మమ్మకు ఇప్పుడు నిజంగానే విషయం సీరియస్ అయిందనిపించింది.

తల పైకెత్తి- ''నాయనా హనుమాన్లూ'' అంటూ పిలిచింది.

పైకొమ్మ మీద కూర్చుని రౌద్రంగా యుద్ధానికి రమ్మన్నట్టు రామాంజనేయుల్ని కవ్విస్తూ అరుస్తున్న వీరాంజనేయులు క్రింది కొమ్మమీదికి దూకి బుద్ధిమంతుడిలా నిశ్శబ్దంగా కూర్చున్నాడు.


''నాయనా నీ తండ్రి నన్ను కొట్టాడని, నువ్విలా ఆయన్ని కొబ్బరికాయతో కొట్టడం ఏం బాగా లేదు. సంసారం అన్నాక సవాలక్ష సమస్యలుంటాయి. ఇన్నేళ్ల తర్వాత ఇదే ఆయన మొదటిసారి కొట్టడం. వయసు మీరింది కదా. బీపీ వచ్చి కొట్టారు. ఆనాడు శ్రీరామచంద్రుడు, సీతమ్మకు చేసిన అవమానం ముందు నాదెంత నాయనా. మీ తండ్రి కోపం నీకు తెలుసు. పట్టుదలా నీకు తెలుసు. ఒక్క రోజు ఎక్కడికన్నా వెళ్లి తలదాచుకుని మరుసటి రోజు యథాప్రకారం ఈ చెట్టుమీదికి వచ్చెయి. అంతా సవ్యంగా జరుగుతుంది'' అంది మహాలక్ష్మమ్మ.

అప్పటి వరకూ నిశ్శబ్దంగా ఉండి శ్రద్ధగా చెవులు రిక్కించి విన్న హనుమాన్లు చివరి మాటకు ఉగ్రుడై భయంకరంగా పళ్లు వెళ్లబెట్టి కిచకిచమని శబ్దం చేసి లంఘించి చెట్టు కొమ్మల పైకి ఎగ్రబాకి గుబురు ఆకుల్లో తోక వేలాడేసి సైలెంట్‌గా కూర్చున్నాడు.

మహాలక్ష్మమ్మ చెట్టు కింద నిలబడి గుబురులోంచి వేలాడుతున్న హనుమాన్లు వాలాన్నే చూస్తూ ఎన్నో విధాల బ్రతిమాలింది. ఊహు.. ఎలాంటి కదలికా లేదు. నిశ్శబ్దంగా అలాగే కూర్చుండిపోయాడు హనుమాన్లు. ఆనాటి రామాంజనేయ యుద్ధాన్ని దేవతలు ఆపగలిగారు కానీ ఈనాటి వీరాంజనేయులు-రామాంజనేయుల యుద్ధాన్ని ఆపడం మహాలక్ష్మమ్మ తరమవుతుందా?

ఏం చేయలేని మహాలక్ష్మమ్మ వంటపనిలో మునిగిపోయింది. వంట చేస్తూనే మహాలక్ష్మమ్మ తమకూ హనుమాన్లకూ ఉన్న అనుబంధాన్ని ఒక్కసారిగా గుర్తు తెచ్చుకుంది.

రామాంజనేయులు ఎక్కడెక్కడో పనిచేసి రిటైరైన తర్వాత కాలనీలోని తమ సొంత ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటికి అతని కొడుకూ కోడలూ కెనడాలో, అల్లుడూ కూతురూ బ్రెజిల్‌లో ఉద్యోగ



రీత్యా ఉంటున్నారు. అంత పెద్ద ఇంట్లో ఇప్పుడు రామాంజనేయులు, మహాలక్ష్మమ్మ ఒకరికొకరు తోడుగా కాలం గడుపుతున్నారు.

ఆరోజు మధ్యాహ్నం కోతులు గుంపుగా కోలాహలంగా చెట్లమీద దూకుతూ పరుగులు పెడుతున్నాయి. ఆ భీకరమైన అరుపులకు భార్యాసమేతంగా దొడ్లోకి వచ్చాడు రామాంజనేయులు. దొడ్లో తమ చెట్లమీద మందగా అవి ఎగురుతూ పోతూంటే చిత్రంగా చూస్తున్న వాళ్ల కాళ్ల దగ్గర 'తప'మని జానెడు కోతిపిల్ల పడింది. తల్లిపొట్ట కరచుకుని ఉన్న ఆ పిల్ల కోతికి ఏ చెట్టు కొమ్మ తగిలిందో కింద పడింది. తల మీద చిన్న రక్తపుగాయం. తల్లికోతి మళ్లీ తిరిగి రానేలేదు. వెనక నుంచి కోతులు పట్టేవాళ్లు వలలు, కర్రలు తీసుకుని ఇల్లిల్లూ దాటుకుంటూ వస్తుంటే అప్పుడు అర్థ వ ం ం ం ం ది రామాంజనేయులికి, వీళ్లని చూసే కోతులు ఇలా దౌడు తీశాయని.

వాళ్లు వచ్చేలోగా మహాలక్ష్మమ్మ ఆ బాలమర్కటాన్ని మృదువుగా తన రెండు చేతులతో పట్టి, తన పైట చెంగులో దాచుకుని లోపలికి తీసుకువెళ్లింది. బెడ్‌రూములో పడుకోబెట్టి ఏసీ ఆన్ చేసింది. గాయాన్ని శుభ్రంగా తుడిచి పౌడరు అద్దింది. ఈ లోపల కోతులు పట్టేవాళ్లు దొడ్లన్నీ దాటుతూ తమ దొడ్డి కూడా దాటిన తర్వాత లోపలికి వచ్చాడు రామాంజనేయులు.

గదిలోకొచ్చి కోతిపిల్లనే చూస్తుండిపోయాడు రామాంజనేయులు. సన్నని కాళ్లు, చేతులు, అగ్గిపుల్లల్లాంటి చేతి వేళ్లు, కాలివేళ్లు, పొడవైన మూతి, చిన్న నుదురు, నెత్తిమీద పొట్టిగా ఉన్న పల్చని నూనూగు వెంట్రుకలు పిడికిలంత శరీరం. కదలకుండా పడి ఉంది.

ఇంతలో గ్లాసునిండా పాలతో వచ్చింది మహలక్ష్మమ్మ. చేతిలో స్పూను. రామాంజనేయులు జాగ్రత్తగా కోతిపిల్ల నోరు తెరిచాడు. మహలక్ష్మమ్మ ఇంకా జాగ్రత్తగా దాని నోట్లో స్పూనుతో పాలు పోసింది. వేడి వేడి పాలు నాలుగు చుక్కలు గొంతులో దిగేసరికి కోతిపిల్లలో చలనం వచ్చింది. కాళ్లు, చేతులు కదిలించింది. కళ్లు మూసుకునే అరగ్లాసు పాలు తాగింది. తర్వాత తల పక్కకు తిప్పి అటు తిరిగి పడుకుంది.

''హమ్మయ్య హనుమాన్లు బ్రతికాడండీ'' సంతోషంగా అంది మహలక్ష్మమ్మ.

తరువాత భర్తతో ''వీడ్ని నేను పెంచుకుంటానండీ. చిన్నపిల్లలు లేని మన ఇంట్లో వీడే చిన్ని కృష్ణుడు'' ఎక్కడో దూరదేశాల్లో ఉన్న మనవళ్లు, మనవరాళ్లను గుర్తు తెచ్చుకుంటూ అంది.

రామాంజనేయులు కాదనలేదు. పైపెచ్చు ప్రోత్సహించాడు కూడా. వెంటనే పుస్తకాల షాపుకి వెళ్లి, కోతుల జీవన విధానాన్ని తెలియచెప్పే 'ప్రైమటాలజీ' అనే పుస్తకాన్ని కొనుక్కుని పెంపకంలోని మెలకువలు కూడా చెప్పాడు. ఆ రాత్రి మహలక్ష్మమ్మ పక్కలో పడుకున్న హనుమాన్లు, ఉదయాన్నే కళ్లు తెరచి ఆమె తన తల్లి కాదని ఆమెను వదిలి, తను పుట్టినప్పటి నుంచీ చూస్తున్న పచ్చని చెట్లు, చిక్కని కొమ్మలు, తన జాతి ప్రాణులు కానరాక కిచకిచమంటూ అరవసాగాడు.

మహలక్ష్మమ్మ లేచి భర్త రామాంజనేయులు సహాయంతో తిరిగి జాగ్రత్తగా హనుమాన్లుని పట్టుకుని ఒళ్లో పడుకోబెట్టుకుని స్పూనుతో పాలు తాగించింది. తర్వాత భయం లేదన్నట్టు వీపు తట్టింది.

**పోట్లూరు సుబ్రహ్మణ్యం**

ఇలా నాలుగు రోజుల పాటు బెడ్‌రూములోంచి బయటికి రానీకుండా పాలుపోస్తూ సాకింది మహలక్ష్మమ్మ. హనుమాన్లు ఏమనుకున్నాడో ఏమో మొదటిరోజు అల్లరి చేయడం తప్ప మరేనాడూ అల్లరి చేయలేదు. అయిదవ రోజు హనుమాన్లను ఎత్తుకుని దొడ్లోకి వచ్చింది మహలక్ష్మమ్మ. రామాంజనేయులు జామచెట్టు కొమ్మ వంచి, పండు కోసి హనుమాన్లు నోటికి అందించాడు. తన చిన్న చిన్న పళ్లతో కొరికి కొరికి తిన్నాడు హనుమాన్లు.

రోజులు గడుస్తున్నాయి. పగలు వంట చేసుకునేటప్పుడు మాత్రమే దొడ్లో చెట్లమీద ఉంటాడు. మిగతా సమయాల్లో ఎప్పుడూ మహలక్ష్మమ్మ కొంగు పట్టుకుని తిరుగుతూ ఉంటాడు హనుమాన్లు. మహలక్ష్మమ్మ పూజ చేసుకునేటప్పుడు ఆమె పక్కనే బుద్ధిగా కూర్చుని ఆమె దేవుడిమీద పాడే భక్తిగీతాలు శ్రద్ధగా వింటాడు. పూజ అయిన తర్వాత దేవుడికి నైవేద్యం పెట్టి, హారతి ఇచ్చి గంట మోగిస్తూంటే రెండు చేతులెత్తి సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేతుడైన రాముడికి భక్తిభావంతో దండం పెడతాడు హనుమాన్లు. ఇదంతా మహలక్ష్మమ్మ చేయించిన అలవాటు.

రాత్రుళ్లు చెట్టుమీద నుంచి పట్టుకొచ్చి, ఒళ్లో కూర్చోబెట్టుకుని 'జై హనుమాన్' సీరియల్ చూపించేది. 'నువ్వెంత వాడివిరా' అంటూ హనుమాన్లతో చెప్పి, హనుమాన్లు కళ్లలో కనిపించే ఆనందాన్ని తనూ పంచుకునేది.

రామాంజనేయులు కూడా హనుమాన్లని బాగా ముద్దు చేసేవాడు. సాయంత్రం పూట రోజూ హనుమాన్లని ఎత్తుకుని దగ్గరలోని పార్కుకి వెళ్లేవాడు. అక్కడ రిటైరైన మిగతా ఉద్యోగులు అతన్ని గేలిచేసినా పట్టించుకునేవాడు కాదు. సరిగ్గా నలభై ఏళ్ల క్రితం 'హామ్' అనే పేరుగల మర్కటం మొదటిసారిగా అంతరిక్షయానం చేసి వ్యోమగామిగా పేరొందింది. ఈ విషయం చెప్పి అప్పుడప్పుడు హనుమాన్లని 'హామ్' అని ముద్దుపేరుతో పిలిచేవాడు.

సంవత్సరం గడచిపోయింది. ఒకరోజు యధాప్రకారం చెట్టు కిందికి వచ్చి 'షికారుకు పోదాం రమ్మని' చేతులు చాచి పిలిచాడు రామాంజనేయులు. కొమ్మమీది నుంచే రానన్నట్టు తల అడ్డంగా ఊపి పళ్లు బయటపెట్టి కిచకిచమన్నాడు హనుమాన్లు.

ఏమీ అర్థం కాక ఆలోచిస్తున్న రామాంజనేయులుతో- ''హనుమాన్లు ఆనాటి అడ్డాలనాటి బిడ్డ కాదండీ. వాడూ పెద్దవాడయ్యాడు. పదిమందిలో ఇంకా తండ్రి చాటు బిడ్డలా ఉండడం వాడికి ఇష్టం లేనట్టుంది. మీరొక్కరే వెళ్లిరండి'' అంది అక్కడే ఉన్న మహలక్ష్మమ్మ.

''అదా అసలు సంగతి. వస్తాన్రా హనుమాన్లూ'' అంటూ అక్కడ నుంచి కదిలాడు రామాంజనేయులు.

ఆరోజు పార్కుకు వెళ్లిన రామాంజనేయులుని అందరూ- ''రామాంజనేయులూ వీరాంజనేయులు ఏడి?'' అని అడిగారు. అందరికీ తగిన సమాధానం చెప్పేసరికి తలప్రాణం తోకకొచ్చింది రామాంజనేయులుకి. ఇంటికొచ్చి హనుమాన్లు తనకే కాక తన స్నేహితులకూ ఎంత ఆత్మీయుడయిందీ భార్యతో చెప్పి మరీ ఆనందించాడు రామాంజనేయులు. అటువంటి హనుమాన్లు ఇప్పుడు తన భర్తకు బద్ధవిరోధి అయ్యాడు. అవన్నీ గుర్తుకొచ్చి కన్నీళ్లు తుడుచుకుంది మహలక్ష్మమ్మ.

రెండో రోజు గడచి మూడో రోజు వచ్చింది. అయినా అటు హనుమాన్లు, ఇటు రామాంజనేయులూ తమ తమ సత్యాగ్రహం మానలేదు. వాళ్లని చూసి మహలక్ష్మమ్మా ఆహారం ముట్టడం లేదు.

ఆరోజు మధ్యాహ్నం స్నేహితుడు రెండు రోజులుగా ఎందుకు షికారుకు రావడం లేదో తెలుసుకోవడానికి వచ్చిన అప్పారావు, రామాంజనేయులు చెప్పినదంతా విన్నాడు. తిరిగి వెళుతూ దొడ్లోకి వచ్చి, చెట్టు మీదికి చూస్తూ- ''ఆఫ్ట్రాల్ కోతితో నీకు విరోధమేమిట్రా. కోతులు పట్టేవాడిని పిలిపిస్తే పట్టుకుపోతాడు'' అంటూ నోరు జారాడు.

అంతే... పై నుంచి అప్పారావు మీద జామకాయల జడివాన కురిసింది. ఫలితం. అప్పారావు అపోలో హాస్పిటల్లో అడ్మిట్ అయ్యాడు.

''పాపం... అప్పారావు అన్నయ్యకు, హనుమాన్లు మాట్లాడలేడే గాని, మానవభాష పూర్తిగా అర్థమవుతుందని తెలియనట్టుంది. తన తల్లి తనకు దూరమయిన కారణం గుర్తొచ్చి ఆవేశంతో ఊగిపోయాడు బుజ్జి హనుమాన్లు'' అనుకుంటూ కళ్లొత్తుకుంది మహలక్ష్మమ్మ.

మూడవరోజు రాత్రి గడచి నాలుగవ రోజు ప్రవేశించింది. పరిస్థితి యధాతధం. ఆరోజు ఉదయం పది గంటల సమయంలో బుట్ట తీసుకుని నీరసంగా ఎక్కడికో బయలుదేరింది మహలక్ష్మమ్మ.

అలా వెళ్లిన మహలక్ష్మమ్మ మధ్యాహ్నం పన్నెండు గంటలకు తిరిగొచ్చింది. వెళ్లినప్పుడు ఎక్కడికి వెళ్లేది చెప్పకుండా వెళ్లడమే కాకుండా, తిరిగి వచ్చి, ఎక్కడికి వెళ్లి వచ్చిందీ చెప్పకపోయేసరికి ఒళ్లుమండింది రామాంజనేయులుకి.

అరిచే ఓపిక లేక- ''నీకు బుద్ధిలేదే'' అన్నాడు రామాంజనేయులు మంచం మీద పడుకునే.

ఆవేశంతో నిప్పులు కక్కింది మహలక్ష్మమ్మ. ''ఎవరికండీ బుద్ధిలేంది? మీకా నాకా? మీ అనుమానాలూ అపార్థాలతో అటు హనుమాన్లని పస్తుపెట్టారు. ఇటు మీరూ పస్తున్నారు. నన్నూ పస్తుం డేట్టు చేశారు. ఈరోజు ఉదయం దొడ్లోకి వెళ్లిన నా భుజం మీద కొబ్బరికాయ పడింది. పైకి చూస్తే చెట్టు మీద హనుమాన్లు ఉన్నాడు. మిమ్మల్ని కొట్టిన హనుమాన్లు, నన్నూ ఎందుకు కొట్టాడా అని ఆలోచించాను. నాకెందుకో అనుమానమొచ్చి, దొడ్లో దాచిన మిమ్మల్ని కొట్టిన కొబ్బరికాయను, నా మీద పడ్డ కొబ్బరి కాయనూ మన ప్రక్క వీధిలో ఉన్న అగ్రికల్చరల్ ఆఫీసరు దగ్గరకు తీసుకువెళ్లాను'' ఆగింది మహలక్ష్మమ్మ.

మళ్లీ ఊపిరి తీసుకుని మాట్లాడడం మొదలుపెట్టింది మహలక్ష్మమ్మ. ''ఆయనతో జరిగిందంతా చెప్పాను. ఆయన రెండు కొబ్బరికాయలనూ పరీక్ష చేసి, ''ఇవి ఎవరో పీకి మీమీద విసిరినవి కావమ్మా. 'ఇరియోఫిడ్ నల్లి' అనే పురుగు కాయల తొడిమల వద్ద చేరి రసం పీల్చడం వల్ల తొడిమ బలహీనమై రాలిపడ్డ కాయలు'' అంటూ వివరంగా చెప్పాడు. అప్పుడర్థమయింది. మీ ఉగ్రరూపం చూసి భయపడి చెట్టెక్కిన హనుమాన్లను మీరా రోజు ఎంతగా అపార్థం చేసుకున్నారో. వెళ్లండి. వెంటనే వెళ్లి హనుమాన్లుకి క్షమాపణ చెప్పుకోండి''

అంతా అర్థమయిన రామాంజనేయులు పశ్చాత్తాపంతో కుంగిపోయాడు. శరీరంలోకి లేనిబలం తెచ్చుకుని నేరుగా చెట్టు కిందికి వచ్చాడు.

''నాయనా హనుమాన్లూ! తప్పు నాదేరా క్షమించరా'' అంటూ చేతులు చాచాడు.

ఆ పిలుపు కోసమే ఎదురుచూస్తున్న హనుమాన్లు చెట్టుమీద నుంచి నేరుగా రామాంజనేయులు చేతుల్లోకి దూకాడు. తన రెండు కాళ్లనూ రామాంజనేయులు నడుము చుట్టూ పెనవేసి, రెండు చేతులతో రామాంజనేయులు మెడను కౌగలించుకున్నాడు.

ఆ దృశ్యం చూస్తున్న మహలక్ష్మమ్మకు కన్నుల పండువుగా వుంది.

♣

